క్లుప్తంగా

కాలుష్యానికి కారకులైన వారిని శిక్షించాలి



ఫార్మా వ్యర్థాలు తగులబెట్టిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న గనిశెట్టి

పరవాడ: తాడి గ్రామ సమీపంలో ఫార్మా వ్యర్థాలు మండించడానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రామ సమీపంలో ఫార్మా వ్యర్థాలు మండిస్తున్న ప్రదేశాన్ని గనిశెట్టి, డివైఎఫ్ఐ నాయకులు గల్లా భార్గవ్ శనివారం పరిశీలించారు. అనంతరం గనిశెట్టి విలేకరులతో మాట్లాడుతూ ఫార్మాసిటీలో చెక్‌పోస్టులు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల ఫార్మా వ్యర్థాలను ఇష్టానుసారంగా సమీప గ్రామాల సమీపంలో మండిస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా కాలుష్యం సమీప గ్రామాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుందన్నారు. ఇలాంటి ఘటనలకు కారకులైన వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై ఆశీనులను చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం, అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వేంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ దర్శకుడు వైవీఎస్ చౌదరి



వైవీఎస్ చౌదరికి ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం సినీ దర్శకుడు వై.వి.ఎస్. చౌదరి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ ప్రసాదాన్ని అందజేశారు.



జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులు



అధునాతనమైన సైన్స్ ల్యాబ్

కల నెరవేరేనా?

- డిగ్రీ కాలేజీ లేక పరవాడ విద్యార్థుల పాట్లు
- దూరప్రాంతాలకు వెళ్లి చదువుకోలేని పరిస్థితి
- జూనియర్ కాలేజీనే అప్‌గ్రేడ్ చేయాలని వినతి



పరవాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల

పరవాడ: పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న పరవాడ ప్రాంతంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ఈ ప్రాంత విద్యార్థులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. పరవాడ, పెదగంట్యాడ, అచ్యుతాపురం ప్రాంతాల్లో ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా, ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్)తో పాటు ఇండస్ట్రియల్ పార్క్ వంటి పరిశ్రమలు నెలకొల్పారు. ఈ ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య రోజు రోజుకి పెరుగుతోంది. దానికి అనుగుణంగా అవసరమైన విద్యాలయాలు లేక పట్టణ ప్రాంతాలపై ఆధారపడుతున్నారు. పరవాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల చదువులు పూర్తి చేసిన విద్యార్థులు ఆపై ఉన్నత చదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లి డిగ్రీ చదవడానికి ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థులు పది, ఇంటర్‌తో చదువులు సరిపెట్టుకుంటున్నారు. దీంతో వారు ఉపాధి అవకాశాలు పొందలేకపోతున్నారు. పరవాడలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని రెండు దశాబ్దాల నుంచి ఈ ప్రాంత ప్రజలు ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేసినా డిగ్రీ కళాశాల కల నెరవేరలేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరవాడలో 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరవాడ, అచ్యుతాపురం, మునగపాక మండలాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత డిగ్రీ చదవాలంటే విశాఖ, గాజువాక, సబ్బవరం ప్రాంతాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలపై ఆధారపడాల్సి వస్తోంది. ఆర్థిక స్థోమత కలిగిన విద్యార్థులు మాత్రమే పట్టణ ప్రాంతాలకు వెళ్లి ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ఉన్నత చదువులు చదువుతుండగా పేద విద్యార్థులు ఇంటర్‌తోనే సరిపెట్టుకోవలసి వస్తోంది. అమ్మాయిలను దూర ప్రాంతాలకు పంపించి చదివించుకోవడానికి తల్లిదండ్రులు చొరవ చూపడంలేదు. సబ్బవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నప్పటికీ సరైన బస్సు సౌకర్యం లేదు. ఫలితంగా విద్యార్థులు సబ్బవరం వెళ్లి డిగ్రీ చదవడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదు. ప్రస్తుతం పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 296 మంది, హైస్కూల్ ప్లస్‌లో 42 మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. పరవాడలో ఏర్పాటు చేసిన ఫార్మా పరిశ్రమలు, సింహాద్రి ఎన్టీపీసీ థర్మల్ పవర్ ప్రాజెక్టు, హిందూజా పరిశ్రమలను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తే విద్యార్థులకు అనేక ప్రయోజనం కలుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అన్ని వసతులు ఉన్నాయి..



పరవాడలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే అవసరమైన వసతి సౌకర్యాలు పుష్కలంగా ఉన్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలపై అదనపు భవనం ఏర్పాటు చేయడం ద్వారా డిగ్రీ కళాశాలకు వసతి సమకూరుతుంది. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో గతంలో విద్యార్థులకు అవసరమైన విద్యుత్, వాటర్ ప్లాంట్, అధునాతనమైన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. విద్యార్థుల ఆట పాటలకు అవసరమైన విశాలమైన క్రీడా మైదానం అందుబాటులో ఉంది. పేద విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా డిగ్రీ కళాశాల ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉంది.

– జి.నారాయణరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

డిగ్రీ కళాశాల లేక ఇబ్బందులు..



పరవాడలో డిగ్రీ కళాశాల ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. డిగ్రీ కాలేజీ లేక పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు వెళ్లి చదువుకోవడానికి విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఆశిస్తున్నాం.

– పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్, ఎంపీపీ, పరవాడ

ఎమ్మెల్యే దృష్టికి కళాశాల సమస్య..



పరవాడలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి ఫార్మా, ఎన్టీపీసీ, హిందూజా, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో ఉపాధి పొందేందుకు అవసరమైన బీఎస్సీ, బీకాం, బీఏ గ్రూపులతో కోర్సులు ప్రవేశపెట్టాలి. తద్వారా విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. సమస్యను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లాం.

– పైల సన్యాసిరావు, సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులు

దూరప్రాంతాలకు వెళ్లలేం..



నేను పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాను. ఇంటర్ తర్వాత ఉన్నత చదువుల కోసం పట్టణ ప్రాంతాల్లోని డిగ్రీ కళాశాలలపై ఆధారపడాల్సి వస్తోంది. స్థానికంగా డిగ్రీ కాలేజీ ఉంటే ఆ సమస్య వచ్చేది కాదు. దూర ప్రాంతాలకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు.

– గొల్లవిల్లి కీర్తిక, ఇంటర్ సెకండ్ ఇయర్

కాళీయ మర్దనునిగా అప్పన్న



కాళీయ మర్దన అలంకారంలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు శనివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి కాళీయ మర్దనుని అలంకారంలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కాళీయ మర్దనుడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో, ఆళ్వారులను మరొక పల్లకిలో ఆశీనులను చేశారు. సింహగిరి మాడ వీధుల్లో ఘనంగా తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: నాయుడుపాలెంలోసీసీడీసీ ఎన్జీవో ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. స్టార్ హెల్త్ సీఎస్సార్ విభాగం ఆర్థిక సహకారంతో నిర్వహించిన శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.సురేష్ కుమార్ పాల్గొని 42 మందికి ఉచితంగా హెచ్‌బీ, ఆర్‌బీఎస్, ఈసీజీ టెస్టులు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు, నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ సభ్యుడు కూండ్రపు శ్రీరామ్మూర్తి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని రైతులు, యువకుల ధర్నా



వంగలి మారీటైం యూనివర్సిటీ ఎదుట ధర్నా చేస్తున్న వంగలి రైతులు

సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామంలో ఉన్న ఇండియన్ మారీటైం విశ్వవిద్యాలయంలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ భూ నిర్వాసిత రైతులు శనివారం విశ్వవిద్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వంగలి గ్రామానికి చెందిన పెద్దలు, భూములిచ్చిన రైతులు ఆకుల గణేష్ తదితరులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఏర్పాటు సమయంలో స్థానికులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. భూసేకరణ సమయంలో గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని, గ్రామ రహదారిని విస్తరించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. వర్సిటీ నిర్మాణం పూర్తయి సుమారు 6 సంవత్సరాలైనా స్థానికులు, భూ నిర్వాసితులకు ఉపాధి కల్పించలేదన్నారు. అనేక మంది స్థానికేతరులకు ఉపాధి కల్పిస్తూ స్థానికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ విషయం పలుమార్లు ప్రజాప్రతినిధులు, కలెక్టర్, వర్సిటీ పెద్దలకు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ఇటీవల స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేక ధర్నాకు దిగినట్లు తెలిపారు. వర్సిటీ పెద్దలు వచ్చి డిమాండ్లపై తమతో చర్చించాలన్నారు. హౌస్ కీపింగ్, గార్డెనింగ్ ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారన్నారు. తమ డిమాండ్ల పరిష్కారానికి వర్సిటీ పెద్దల నుండి సానుకూల నిర్ణయం వచ్చేంత వరకూ ధర్నా కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. తహసీల్దార్ బి. చిన్నికృష్ణ ధర్నా శిబిరాన్ని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, భూ నిర్వాసితులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా అప్పన్న నగల పరిశీలన

దేవదాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు



రికార్డులు పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారి పల్లంరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జ్యూయలరీ వెరిఫికేషన్ పారదర్శకంగా జరుగుతోందని రాష్ట్ర దేవదాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు తెలిపారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి దాతలు కానుకగా సమర్పించిన బంగారు, వెండి, ఇతర విలువైన వస్తువుల రికార్డులను రెండవ రోజు శనివారం పల్లంరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి బంగారం తాలూకా రికార్డులను ఇప్పటి వరకు పరిశీలించామని, మరో మూడు రోజుల పాటు వెండి వస్తువుల రికార్డుల పరిశీలన ఉంటుందన్నారు. రికార్డులు వెరిఫికేషన్ పూర్తి కాగానే ఒక్కో వస్తువుని తనిఖీ చేసి దానికి సంబంధించిన రికార్డు ఉందో లేదో పరిశీలిస్తామన్నారు. మరో పది రోజుల పాటు ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఏమాత్రం తేడా వచ్చినా కచ్చితంగా రికార్డు చేస్తామన్నారు. నివేదికను దేవదాయ శాఖ కమిషనర్‌కి పంపిస్తామన్నారు. అదే నివేదికను మీడియాకు కూడా విడుదల చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాల ఆభరణాల రికార్డులు త్వరలోనే డిజిటలైజేషన్ చేయాలని దేవదాయ శాఖకి సిఫారసు చేస్తామన్నారు. ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకి ఆభరణాలు సమర్పించే దాతలు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని తెలియజేసే విధంగా బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. కాగా దాతలు సమర్పించిన బంగారు, వెండి, ఇతర విలువైన వస్తువులు రికార్డుల ప్రకారం లేవని, వస్తువుల వివరాలను బహిర్గతం చేయాలని, వాటికి సంబంధించి రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో తెలియపరచాలని కడప జిల్లాకు చెందిన కె.ప్రభాకరాచారి అనే వ్యక్తి దేవదాయ శాఖకి ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ జరుగుతోంది.

మానవతా విలువలతో ఉత్తమ జీవనం



మాట్లాడుతున్న బ్రహ్మకుమారీ సత్యవతి

పెందుర్తి: నశించిపోతున్న మానవతా విలువలను కాపాడాలన్నదే ప్రజాపిత బ్రహ్మ బాబా తత్వమని బ్రహ్మకుమారీ సత్యవతి అన్నారు. పురుషోత్తపురంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో శనివారం బ్రహ్మ బాబా 55వ సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవామార్గంలో నడవాలని ఆకాక్షించారు. మానవతా విలువలపై నిరంతరం ఆధ్యాత్మిక తరగతులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామని చెప్పారు. ముందుగా బ్రహ్మ బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. బ్రహ్మకుమారీలు బీకే రేష్మ, బీకే దేవకి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన బ్రహ్మకుమారీలు, స్థానికులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో పద్మజ తదితరులు



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పంచకర్ల, కార్పొరేటర్ వసంత



పురుషోత్తపురంలో చెత్త ఊడ్చుతున్న కార్పొరేటర్ దేముడు తదితరులు

సబ్బవరం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత కావాలని ఎంపీడీవో పద్మజ అన్నారు. మండల కేంద్రం సబ్బవరంలో స్వచ్ఛ ఆంధ్రా–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల పరిషత్‌తో పాటు పలు శాఖల అధికారులు, సిబ్బంది స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సబ్బవరంలోని సంత బయలులో పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక సీతారామ కల్యాణ మండపం వద్ద మానవహారం నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మండల పరిషత్ సిబ్బందితో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఈవోపీఆర్‌డీ చైతన్య, ఏవో శివరాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి పెద్దపీట..

పెందుర్తి: నియోజకవర్గంలో పారిశుధ్యానికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ ప్రాంతంలో మొక్కలు నాటారు. పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ శానాపతి వసంత, జోనల్ కమిషనర్ కె.హేమావతి, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

95వ వార్డులో..

స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు చెత్త ఊడ్చి మొక్కలు నాటారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సతివాడమ్మ తల్లి పరస



కోలాహలంగా పరస



సతివాడమ్మ తల్లి

పెందుర్తి: గొరపల్లిలో వెలసిన ఏడు ఊళ్ల గ్రామదేవత సతివాడమ్మ తల్లి పరస శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు–కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం అలరించింది. రంగుల రాట్నాలు, వివిధ రకాల ఆటలతో పిల్లలు సందడి చేశారు. సర్పంచ్ గొరపల్లి శ్రీను, నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గంగమ్మపేట, కోట్నివానిపాలెం, గవరపాలెం, కరకవానిపాలెం, సంతపాలెం, గొల్లలపాలెం తదితర ప్రాంతాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్‌టీఆర్‌కు నివాళి



పెందుర్తిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న గండి బాబ్జీ, పీలా శ్రీనివాసరావు తదితరులు

పెందుర్తి: దివంగత ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు వర్ధంతి పెందుర్తి కూడలి వద్ద నిర్వహించారు. రాష్ట్ర అయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు నివాళి అర్పించారు. చినముషిడివాడలో కార్పొరేటర్ శానాపతి వసంత, శంకర్రావు ఎన్‌టీఆర్‌కు నివాళి అర్పించారు.

పరవాడలో..

పరవాడ: పరవాడ గ్రామంలో నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర ఆయిల్ ఫీడ్ కార్పొరేషన్ చైర్మన్ గండిబాబ్జీ ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. వెన్నెలపాలెంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్వర్గీయ ఎన్టీ రామారావుకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, మాజీ ఎంపీపీలు మాదంశెట్టి నీలబాబు, ఎం.అప్పలనాయుడు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు. తానాం గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ కన్నూరుదేవి వెంకటరమణ ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించి పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. న్యూ కరాస ప్రాంతంలో సీసీ రోడ్లు , కాలువల నిర్మాణ పనులు పరిశీలించి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఏఈ ఉష, సిబ్బంది పాల్గొన్నారు.

కుంభమేళాలో అలరించిన ఉషశ్రీ ప్రదర్శన

కంచరపాలెం : ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో విశాఖ జిల్లా కంచరపాలెం ప్రాంతానికి చెందిన ఉమ్మిడి ఉషశ్రీ భరత నాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన శ్రీవారి నమూనా ఆలయంలో స్వామి ఊంజల్ సేవలో హిందూ ధర్మ ప్రచార పరిషత్, వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల సిబ్బంది డాక్టర్ ఎం.ఉమా ముద్దుబాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శనలో నాట్య గురువులు డాక్టర్ పరంకుశం శరత్‌చంద్రతో కలిసి ఉషశ్రీ చేసిన భరతనాట్యం చూపరులను కట్టిపడేసింది. ఉషశ్రీ తన హావభావాలతో అందరిలో భక్తి భావాన్ని పెంపొందించింది. 144 సంవత్సరాలకు వచ్చే మహా కుంభమేళాలో భరతనాట్యం చేయడం తమ పూర్వ జన్మ సుకృతంగా ఆ బృంద సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.